www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 20 ఏప్రిల్ 2025



10న జాతీయ లోక్ అదాలత్

నూజివీడు టౌన్ : మండల న్యాయ సేవాధికార సంస్థ నూజివీడు వారి ఆధ్వర్యంలో మే నెల 10వ తేదీన రెండవ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా ఇరు పార్టీలు హాజరు కావడం ద్వారా రాజీ కుదుర్చుకొని తద్వారా ఖర్చు, సమయం ఆదా చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న అన్ని క్రిమినల్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ ఆక్సిడెంట్ కేసులు మొదలుకొని పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పోలీసు అధికారులు, బార్ మెంబర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా చూడమని పోలీసు వారికి, అడ్వకేట్స్‌కు సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదకాసిం, ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ వి.వెంకటేశ్వరరావు, సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.శివ పార్వతి పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చేదెప్పుడు..!

గతేడాది జులైలో పెద్దఎత్తున వరదలు
'పశ్చిమ'లో రూ.12,957 ఎకరాల్లో పంట నష్టం
ఏలూరు జిల్లాలో 350 ఎకరాల్లో పంటను కోల్పోయిన రైతులు
రెండు జిల్లాల్లో రూ.11 కోట్లు పరిహారం అందించాలని తేల్చిన అధికారులు
దాదాపు ఏడాది గడుస్తున్నా ఆ ఊసే కరువు
సెప్టెంబర్‌లో దెబ్బతిన్న పంటలకే పరిహారం జమ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు వెంటనే పరిహారం అందించామని ఊదరగొడుతున్న ప్రభుత్వం, గతేడాది జులైలో ఖరీఫ్ సాగులో విరుచుకుపడిన వరదలకు సంబంధించి దెబ్బతిన్న పంటల నష్టపరిహారం ఇప్పటికీ రైతులకు అందించని పరిస్థితి నెలకొంది. దీంతో తమకు పరిహారం ఎప్పుడు అందుతుందని రైతులు అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ ఇదే అంశంపై ప్రజాప్రతినిధులు మాట్లాడటం గమనార్హం. తమది రైతు ప్రభుత్వమని చెబుతూనే అన్నదాత పట్ల కూటమి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. గడిచిన ఖరీఫ్ సాగులో జులై, సెప్టెంబర్ మొదటి వారాల్లో పెద్దఎత్తున వరదలు విరుచుకుపడ్డాయి. రెండు జిల్లాల్లోని రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసింది. జులై మొదటివారంలో వచ్చిన వరదలకు పెద్దఎత్తున పంట పొలాలు దెబ్బతిన్నాయి. నిబంధనల పేరుతో 33 శాతానికిపైగా దెబ్బతిన్న పొలాలనే పరిగణనలోకి తీసుకోవడంతో పంట నష్టం అంచనాలు భారీగా తగ్గాయి. జులైలో వచ్చిన వరదలకు పశ్చిమగోదావరి జిల్లాలో 12,957 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు అధికారులు తేల్చారు. ఎకరాకు రూ.పది వేలు చొప్పున రైతులకు రూ.11 కోట్లు పంట నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి నివేదించారు. ఏలూరు జిల్లాలో పెదవాగు గండిపడి వేలేరుపాడు మండలంలో పెద్దఎత్తున పంటనష్టం జరిగింది. పొలాల్లో ఇసుక మేటలు పేరుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నిబంధనల పేరుతో కోతలు విధించి 350 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, దాదాపు రూ.కోటి వరకూ రైతులకు పంట నష్టపరిహారం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.



పరిహారంపై ఊసు, పలుకు కరువు


గడిచిన ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టానికి సంబంధించి దాదాపు పది నెలలు గడిచిపోతుంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం అందించని పరిస్థితి ఉంది. సెప్టెంబర్ మొదటి వారంలో విరుచుకుపడిన వరదలకు ఏలూరు జిల్లా నూజివీడు, పెదపాడుతోపాటు పశ్చిమలోనూ భారీగా పంటనష్టం వాటిల్లింది. రెండు జిల్లాల్లో దాదాపు రూ.ఏడు కోట్ల వరకూ పంటనష్టం కింద రైతులకు అందించాలని అంచనాలు వేశారు. అదే సమయంలో విజయవాడ పరిసర ప్రాంతాలను వరద అతలాకుతలం చేసింది. వారం రోజుల్లోనే నష్టపోయిన రైతులకు పంటనష్ట పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అన్నట్లుగానే సెప్టెంబర్‌లో విరుచుకుపడిన వరదలకు సంబంధించిన పరిహారం వారంలోనే అందించారు. జులైలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి మాత్రం ఇప్పటి వరకూ ఇవ్వలేదు. ప్రభుత్వం కావాలనే వదిలేసిందా.. లేక పంట నష్టపరిహారం ఇవ్వనుందా అనే అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి వెంటనే పరిహారం ఇచ్చినట్లు ప్రభుత్వం పదేపదే చెబుతోంది. జులైలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వకపోడానికి కారణాలేమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా జులైలో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన పరిహారం వెంటనే అందించాలని రైతులు కోరుతున్నారు. జులైలో దెబ్బతిన్న పంటల పరిహారానికి సంబంధించి ఏలూరు వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌భాషాను అడగ్గా సెప్టెంబర్‌లో దెబ్బతిన్న పంటల పరిహారం వారం రోజుల్లోనే జమైందని, జులైలో జరిగిన నష్టపరిహారం రావాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వ పరిశీలనలో ఉందని, త్వరలోనే చెల్లించే అవకాశం ఉందని చెప్పారు.



చెత్త ఎత్తుతున్న కలెక్టర్, జెసి, ఎస్‌పి

కృష్ణా కాల్వ గట్లపై శ్రమదానం

పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, జెసి



కలెక్టరేట్‌లో ఇ-వేస్టును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు


ప్రతి మూడో శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో శనివారం స్థానిక కృష్ణ కాలువలో గట్లపై విస్తృతంగా శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలు, చెత్త, వ్యర్థాలను తొలగించడం, పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ చర్యలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి స్వయంగా పాల్గొని శ్రమదానం నిర్వహించారు. వీరితోపాటు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, ఇరిగేషన్ ఎస్‌ఇ నాగార్జునరావు, డిఎస్‌ఒ ప్రతాపరెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, వరిటెక్స్ సిఐ సత్యనారాయణ, ఎఇ అదీల్ పవన్ కుమార్, రెవెన్యూ, పోలీసు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్మార్ట్ సిటీ అధికారులు పాల్గొన్నారు. కృష్ణాకాలువ గట్లపై, కాలువలో ఉన్న వ్యర్థాలను స్వయంగా తీసి మున్సిపల్ ట్రాక్టర్లో వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన విధానం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు. జిల్లా నుంచి మండల, గ్రామస్థాయి వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో కొంత అవగాహన కలుగుతుందన్నారు. ఈ విషయంలో ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపాల్టీ వారికి అప్పగిస్తే వారు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. రోజువారీ అవసరాలకు ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు ఉపయోగించాలని కోరారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామన్నారు. జిల్లాను స్వచ్ఛ ఏలూరుగా మార్చాలన్నారు. ఏలూరులో కృష్ణ కాల్వ ఐదు కిలోమీటర్ల మేర శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. కాలువలో చెత్త వేయకుండా నిరోధించేందుకు కృష్ణ కాల్వపై ఉన్న వంతెనలకు ఇరువైపులా మెస్‌లు కట్టాలని సూచించారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా పౌరుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతోందన్నారు. ఈ భూతాపాన్ని సమాజ సేవ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఏలూరు నగరాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఏలూరులోని చారిత్రక కాలువల్లో ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను తొలగించి ఆహ్లాదకర ప్రదేశాలుగా మార్పు చేయడం ఈ కార్యక్రమ లక్ష్యమని అన్నారు. ఈ ప్రాజెక్టును తొలుత కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసి, వాటి ఫలితాలను అనుసరించి ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో బహుముఖంగా విస్తరింపచేయడం ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ప్రమాదం
కలెక్టరేట్‌లో మొక్కలు నాటిన కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఏలూరు కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ-చెక్ కార్యక్రమంలో వివిధ శాఖల నుండి సేకరించిన ఎలక్ట్రానిక్ వేస్టును పరిశీలించి సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇ-వేస్టును సరైన పద్ధతిలో రీసైక్లింగ్ చేయకపోవడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. కార్యాలయాల్లో, ఇళ్లల్లో, దుకాణాల్లో వృథాగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల పరిధిలోని సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

15 రోజులకు ఒకసారి పే స్లిప్‌లు ఇవ్వాలి
వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ



నిరసిస్తున్న ఉపాధి కూలీలు, నేతలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని, పే స్లిప్ ఇవ్వాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పంగిడిగూడెంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే మూడు నెలలు కావొస్తున్నా పని చేసిన కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వలేదని మండిపడ్డారు. మరోపక్క ఉపాధి కూలీలకు చట్టప్రకారం 15 రోజులకోసారి వేతనం, పే స్లిప్ ఇవ్వాలని చట్టంలో ఉన్న దానిని అమలు చేయడం లేదని మండిపడ్డారు. కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు టెంట్, తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. ఏడేళ్ల క్రితం ఇచ్చిన పనిముట్లతోనే పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కూలీలకు ఇవ్వాల్సిన రవాణా ఛార్జీలు నేటికీ అందలేదన్నారు. చట్టప్రకారం అందరికీ సమాన వేతనం అని చెబుతూ వేతనాల విషయంలో వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఒకపక్క వ్యవసాయ పనులేక కూలీలు అల్లాడుతుంటే మరోపక్క ఉపాధి పనులు చేసిన కూలీలకు వేతనాలు సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పేదలకు, వ్యవసాయ కూలీలకు, ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పని చేస్తున్న ప్రతి కుటుంబానికి రెండొందల రోజులు పని దినాలు, రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. రానున్న కాలంలో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని, దాని కోసం జరిగే ఆందోళన, పోరాటాల్లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామూకొండ వీర్రాజు, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.61.39 కోట్లు వేతన బకాయిల వెంటనే విడుదల చేయాలి

21, 22 తేదీల్లో ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలి

ఏలూరు: ఉపాధి హామీ కూలీల వేతన బకాయిల విడుదలకు ఈ నెల 21, 22 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉపాధి కూలీలకు గత ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి మార్చి 31 వరకు వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సుమారు రూ.49.83 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్ రెండు వారాల్లో మరో రూ.11.56 కోట్లు, మొత్తంగా రూ.61.39 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో చనిపోయిన కూలీల కుటుంబాలకు నేటికీ నష్టపరిహారం అందలేదని విమర్శించారు.

పేదలపై పోలీసుల ప్రతాపం..

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత
ఇళ్ల తొలగింపును అడ్డుకున్న పేదలు, సిపిఎం నేతలు
మహిళలపై మగ పోలీసుల కీచకపర్వం
దొరికిన వారిని దొరికినట్లు లాగేసిన ఖాకీలు
ఒక మహిళ తలకు బలమైన గాయం, మరో ఏడుగురికి అస్వస్థత
ఇళ్లు తొలగిస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించిన బాధితులు
వెనక్కి తగ్గిన అధికార యంత్రాంగం
పేదలపై ఎంఎల్‌ఎ యుద్ధం సరికాదు
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

మండల కేంద్రమైన పాలకోడేరు శివారు ఎఎస్ఆర్ నగర్ శనివారం రణరంగంగా మారింది. అధికార యంత్రాంగం పేదల ఇళ్ల తొలగింపునకు యత్నించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు దురుసుగా వ్యవహరించడంతోపాటు మహిళలని చూడకుండా ఎక్కడపడితే అక్కడ చేతులేసి దొరికిన వారిని దొరికినట్లు లాగి పడేశారు. ఈ ఘటనలో ఒక మహిళకు తీవ్ర గాయాలవ్వగా, మరో ఏడుగురు పేదలు గాయాల పాలై స్పృహ తప్పి పడిపోయారు. ఈ నేపథ్యంలో ఎఎస్ఆర్ నగర్‌లోకి అధికార యంత్రాంగాన్ని వెళ్లనీయకుండా పేదలు రోడ్డుపై బైఠాయించారు. ఒక్క అడుగు ముందుకేసినా, ఇళ్లు తొలగించినా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామంటూ పెట్రోల్ బాటిళ్లు చేతబూని నిరసన తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

స్థానిక ఎఎస్ఆర్ నగర్‌లో ఇరిగేషన్ కాలువ గట్టుకు చేర్చి 1986 నుంచి 130 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాయి. వీరిలో 35 కుటుంబాలకు ప్రభుత్వ లేఅవుట్లో స్థలాన్ని చూపించినప్పటికీ కోర్టు కేసు నడుస్తుండటంతో ప్రభుత్వం లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదు. అయితే కాలువల ప్రక్షాళన, అభివృద్ధి, కాలుష్యం పేరుతో ఇరిగేషన్, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఉన్న ఆక్రమణల తొలగింపునకు ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు చర్యలు చేపట్టారు. అయితే ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూమినే నమ్ముకుని ఉన్నదంతా ఇంటి నిర్మాణానికి ఖర్చు చేసి నిరుపేదలంతా ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల పేరుతో వారికి ఎటువంటి ప్రత్యామ్నాయమూ చూపించకుండానే ఇళ్లను తొలగించడానికి కొంతకాలంగా ప్రయత్నాలు సాగుతున్నాయి. శనివారం ఉదయమే పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతోపాటు పోలీసులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.



నేతలను అరెస్టు చేసి తీసుకెళ్తుండగా జీపును చుట్టుముట్టిన పేదలు



పోలీసులతో తోపులాటలో గాయపడిన వ్యక్తి

భీమవరం, భీమవరం రూరల్‌తోపాటు చుట్టుపక్కల పోలీస్ స్టేషన్ల నుంచి సుమారు 50 మంది పోలీసులు, మహిళా పోలీసులు మొహరించారు. మూడు జెసిబిలతో ఇళ్ల తొలగించేందుకు పోలీసు బందోబస్తు నడుమ అధికార యంత్రాంగం ముందుకు కదిలింది. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యతోపాటు నిరుపేదలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే జెసిబిలు నిలుపుదల చేయకుండా ముందుకు కదిలించడంతో పేదలంతా పెట్రోల్ సీసాలతో నేలపై బైఠాయించారు. ఇళ్లు తొలగించాలని చూస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో పోలీసులు, నిరుపేదల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని తోపులాటకు దారి తీసింది. ఈ క్రమంలో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలని చూడకుండా మగ పోలీసులు ఇష్టానుసారం చేతులేసి లాగే ప్రయత్నం చేయడం చర్చనీయాంశమైంది.

ప్రతిఘటించిన నిరుపేదలు

ఇళ్లను కాపాడుకోవడానికి రోడ్డుకు అడ్డంగా కూర్చున్న పేదలను భయపెట్టేందుకు అగ్నిమాపక వాహనం ద్వారా వాటర్ గన్స్‌తో నీళ్లు చిమ్మేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే బాధిత ప్రజలు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని మరోసారి పెద్దఎత్తున నినదించారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారి నుంచి పెట్రోల్ బాటిళ్లను స్వాధీనం చేసుకునేందుకు యత్నించడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఒక వ్యక్తి శరీరంపై పెట్రోల్ పోసుకునే సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పెట్రోల్ అంతా పోలీసులు, పక్కనే ఉన్నవారిపై పడింది. దీంతో పోలీసులు వెనక్కి తగ్గారు. దీంతో ఆ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ జీపులో తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. బాధిత ప్రజలందరూ పోలీసు వాహనానికి అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు సత్యనారాయణను విడిచిపెట్టారు. సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ్యను కూడా అరెస్టు చేసి తీసుకెళ్తున్న క్రమంలో పేదలు అడ్డుకుని ప్రతిఘటించారు.

నాగవరపు ఈశ్వరికి తలకు గాయం, మరో ఏడుగురికి అస్వస్థత

పోలీసులకు, నిరుపేదలకు మధ్య జరిగిన ఘర్షణలో నాగవరపు ఈశ్వరి తలకు బలమైన గాయమైంది. తోపులాటలో స్థానికంగా ఉన్న కల్వర్టుపై పడడంతో తలకు గాయమై రక్తస్రావమైంది. దీంతో హుటాహుటిన అంబులెన్స్‌లో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మరో ఏడుగురు అస్వస్థతకు గుర య్యారు. మల్లుల సావిత్రి, మెట్ట భారతి, హనుమంతు చిన్న, దేవరపు సత్యవతి, దొంగ వరలక్ష్మి, జోగి సత్యవతి, మల్లుల రామకృష్ణలకు స్వల్ప గాయాలై అస్వస్థతకు గురవ్వడంతో వారిని పాలకోడేరు పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు, అధికారులు వెనక్కి తగ్గి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



స్పృహ కోల్పోయిన మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

కోటి 23 లక్షల పనిదినాలు కల్పించాం

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి: జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా 2024-2025లో కోటి 23 లక్షల పనిదినాలు కల్పించామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం మండల పరిధిలోని కొమ్మూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 3.77 లక్షల జాబ్ కార్డులు వుండగా 2024-2025 ఆర్థిక సంవత్సరంలో కోటి 20 లక్షల పనిదినాలను కల్పించాలనే లక్ష్యం కాగా, ఇంతవరకు కోటి 23 లక్షల పనిదినాలు(103శాతం) పనిదినాల లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం సాధించిందన్నారు. ఇప్పటి వరకు 4.23 లక్షల మంది వేతనదారులకు రూ.312.57 కోట్లు వేతనాలు చెల్లించామన్నారు. రానున్న మూడు నెలల్లో 90 లక్షల పనిదినాలు కల్పించాలనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ, ఒఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో వుంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎపిఒ మీనాక్షి, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మూడవ శనివారం సందర్భంగా మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలిసి ఆయన పరిసర ప్రాంతాలను శుభ్రం చేయటంతో పాటు చెత్తను ట్రాక్టర్‌లో వేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీ విక్టర్‌బాబు, ఎంపిడిఒ బి.ఆనందబాబు, తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎపిఒ మీనాక్షి, పంచాయితీ కార్యదర్శి బి.ప్రసాద్, నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఎన్.వేణు, డి.ఏసుపాదం, పి.నరసింహారావు, సిహెచ్.శివరామకృష్ణ పాల్గొన్నారు.



జెఇఇ మెయిన్స్‌లో నూజివీడుకు చెందిన మధునవ్, హర్షిత్, నిఖిల, చింతలపూడి విద్యార్థిని సిరిసంజన సత్తా చాటాలు

జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన కుసుమాలు

నూజివీడు టౌన్ : నూజివీడు మండలానికి చెందిన విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో టాపర్స్‌గా నిలిచారు. పట్టణ పరిధిలో ఉన్న శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించిన ఎ.మధునవ్ జెఇఇ మెయిన్స్‌లో 97.69 పర్సంటేజ్ సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 9,835 ర్యాంక్ ఒబిసి కేటగిరిలో సాధించాడు. ఈ విద్యార్థి పోలవరం ముంపు మండలాలలో ఒకటైన కూనవరం మండలంకు చెందిన విద్యార్థి కావడం విశేషం. శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపల్ జి.శ్రీమన్నారాయణ, అధ్యాపకులు, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు. త్రివిధ విద్యా సంస్థలకు చెందిన పూర్వ విద్యార్థి మండలంలోని జంగంగూడెం గ్రామానికి చెందిన తోమ్మండ్రు హర్షిత్ జెఇఇ మెయిన్స్ ఎస్‌సి కేటగిరిలో 112వ ర్యాంకు సాధించాడు. హర్షిత్‌ను త్రివిధ విద్యాసంస్థల అధినేత సబ్బినేని శ్రీనివాస్, అధ్యాపక బృందం అభినందించింది. త్రివిధ విద్యాసంస్థల పూర్వ విద్యార్థి మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన బోనాల నిఖిల జెఇఇ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 159వ ర్యాంకును ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో సాధించింది. గ్రామ ప్రముఖులు, అధ్యాపకులు ప్రశంసించారు.

చింతలపూడి : జెఇఇ మెయిన్స్ ఫలితాలలో ప్రగడవరం హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మారుమూడి రవికుమార్ కుమార్తె సిరిసంజన 99.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. జాతీయ స్థాయిలో జనరల్ ర్యాంక్ 8610, కేటగిరి ర్యాంకు 204 సాధించారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న టిడిపి నేతలు

చింతలపూడి : టిడిపి కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ నరసింగాపురం గ్రామంలో టిడిపి కార్యకర్త మధ్యాహ్నపు సత్యనారాయణ అనారోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబం ఉండటానికి ఇల్లు కూడా లేకపోవడంతో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, చిలుకూరి సుధీర్ రెడ్డి, వార్డు నెంబర్ నల్లగోపు కృష్ణమూర్తి ఆర్థిక సహాయం అందజేశారు. మధ్యాహ్నపు సూరిబాబుకి గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా రూ.22 వేలు, తాళ్లూరి శ్రీనివాసరెడ్డి ద్వారా రూ.5 వేలు మొత్తం రూ.27 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి నరసింగపురం గ్రామ టిడిపి నాయకులందరూ కలిసి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులందరూ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

ముదినేపల్లి : మండల తహశీల్దార్ పవన్ కుమార్‌ను శనివారం మండల ఎండియు డీలర్స్ యూనియన్ సభ్యులు సత్కరించారు. గతంలో తహశీల్దార్‌గా వ్యవహరించిన సుభాని బదిలీపై రాష్ట్ర సచివాలయానికి వెళ్లారు. దీంతో డీటీగా ఉన్న పవన్ కుమార్ ముదినేపల్లి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం పాఠకులకు విధితమే. ఈ సందర్భంగా ఎండియు డీలర్స్ యూనియన్ మండల ప్రెసిడెంట్ పాము అభిలాష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ పవన్ కుమార్‌ను కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పరసా కిషోర్, కమిటీ సభ్యులు రాజు, నాగరాజు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు నివాళి

ముదినేపల్లి : సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి వేడుకలు శనివారం ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. ముదినేపల్లిలోని సంత మార్కెట్ వద్ద ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, నాయకులు దావు నాగరాజు, పరసా కనకారావు, వీరంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **నూజివీడు టౌన్ :** గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి, ముసునూరు, నూజివీడు టౌన్, రూరల్, ఆగిరిపల్లి మండల నాయకులు చల్లా సాంబశివరావు, చాట్రాయి మండల గౌడ సంఘం అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ఆగిరిపల్లి :** బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడిన మహోన్నత వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని, ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం ఆగిరిపల్లి మెయిన్ సెంటర్లోని టిడిపి స్తూపం వద్ద సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. **చాట్రాయి :** మండలంలోని చనుబండలో గౌతు లచ్చన్న 19వ వర్ధంతిని చాట్రాయి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ గౌడ్ సంఘం నాయకులు తల్లాడ శ్రీనివాసరావు, చింత శ్రీనివాసరావు, రాష్ట్ర బిసి సంఘం ప్రధాన కార్యదర్శి చింత అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

టి.నరసాపురం : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మండలంలోని శ్రీరామవరానికి చెందిన ఎంపిటిసి నులకాని నరసింహారావు, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తిరుమల దేవి పేట గ్రామానికి చెందిన తోట లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పరామర్శించారు. వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు వైసిపి అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీనర్ ఎస్ విపికెహెచ్.శ్రీనురాజు, దాకారపు సూరిబాబు, కాల్నీడి సుబ్బారావు ఉన్నారు.

ఇకెవైసి తప్పనిసరి : తహశీల్దార్

ముసునూరు : మండలంలోని 16 గ్రామ పంచాయతీల రేషన్ కార్డుదారులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ కె.రాజకుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంకా 1,955 మంది రేషన్‌కార్డు దారులు ఉన్నారని, వీరందరూ ఆయా రేషన్ కార్డు డీలర్ల వద్ద, పిడియు వద్ద, గ్రామ సచివాలయాలలో ఇకెవైసి చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో మే నెలలో వీరికి రేషన్ కార్డు నుంచి రేషన్ మంజూరు కాబడదని పత్రికా ముఖంగా తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు.

పోలవరం ప్రాజెక్ట్, పట్టిసీమ ఎత్తిపోతల పథకం సందర్శన

పోలవరం : మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు శనివారం పోలవరం ప్రాజెక్ట్, పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. మహారాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి సంజయ్ బెల్సారే, గోదావరి నది నిర్వహణ ఔరంగాబాద్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ తీర్మన్వర్, జలవనరుల విభాగం పుణె చీఫ్ ఇంజనీర్ హనుమంత్ గుణాలే, సిడిఒ నాసిక్ విభాగం చీఫ్ ఇంజనీర్ ఆశీష్ డియోగడే పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమలను సందర్శించారు. వారిని ప్రాజెక్ట్ సిఇ కె.నరసింహమూర్తి శాలువా కప్పి సత్కరించారు. మహారాష్ట్ర అధికారులకు పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకం గురించి సిఇ కె.నరసింహమూర్తి, ఇఇ డి.శ్రీనివాస్, ఎఇఇలు పద్మకుమార్, అనీల్ కుమార్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర వివరించారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలి

ఆగిరిపల్లి: ఉపాధి హామీ వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టంలో కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా శనివారం ఈదులగూడెంలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం పనులను పరిశీలించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొన్నారు. వారి డిమాండ్లు పరిష్కరించాలని ఈనెల 21న స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో ఉకూలీలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. ఎం.స్టాలిన్, శశిరేఖ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారం

దెందులూరు: స్థానిక సమస్యలకు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సత్వర పరిష్కారం చూపించారు. శనివారం ఉదయం పెదవేగి మండలం వేగివాడ గ్రామంలోని ఎస్‌టి కాలనీలో పర్యటిస్తున్న ఆయన స్థానిక మహిళలు కాలనీలోని డ్రెయినేజీ అధ్వాన స్థితిలో ఉండి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, కనీసం నడకదారి కూడా నడవలేని పరిస్థితిలో ఇబ్బందిగా ఉందని సమస్యను పరిష్కరించాలని ఎంఎల్ఎను కోరారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన సత్వరమే డ్రెయిన్ మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించి సమస్యను పరిష్కరించారు. టిడిపి సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, కన్నాపురం అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్, తాళ్ల గోకవరం ప్రెసిడెంట్ సురేష్ పాల్గొన్నారు.

నేరస్తులను సులువుగా పట్టుకునేందుకు డ్రోన్‌లు దోహదం

ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్

ఏలూరు స్పోర్ట్స్ : డ్రోన్‌లో టెక్నాలజీ వినియోగించి అత్యంత తక్కువ సమయంలోనే నేరస్థులను పట్టుకునేందుకు పోలీస్ శాఖ కృషిచేస్తుందని ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అవంతి ఫీట్స్ అధినేత ఇంద్ర కుమార్ ఎనిమిది లక్షల విలువైన అత్యాధునిక డ్రోన్‌ను జిల్లా పోలీసు శాఖకు బహూకరించారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ ఐజి మాట్లాడుతూ అవంతి ఫీట్స్ అధినేతకు, ఏలూరు సిఆర్ఆర్ కళాశాలల ప్రెసిడెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, పోలవరం డిఎస్‌పి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగలు అరెస్ట్

కలిదిండి : మోటార్ సైకిళ్లు అపహరిస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక నిఘా పెట్టి కలిదిండికి చెందిన పనమాల జగదీష్, చేబోయిన శ్యామ్ తేజను పట్టుకోవడం జరిగిందన్నారు. వీరి నుంచి సుమారు రూ.3 లక్షల 50 వేలు విలువ చేసే ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

తుప్పల్లోనే టిడ్కో ఇళ్లు..

- ఏడేళ్లు గడిచినా గృహాల ఊసే లేదు
- ఏడాది గడుస్తున్నా.. పట్టించుకోని కూటమి సర్కార్
- రూ.6.91 కోట్ల డిపాజిట్లు చెల్లించిన లబ్ధిదారులు
- అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న పేదలు
- గృహనిర్మాణ శాఖామంత్రి ఇలాకాలోనూ లబ్ధిదారులకు అన్యాయమే


పిచ్చిమొక్కలు చేరి అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గం పరిధిలో పేద కుటుంబాలు, మధ్యతరగతి కుటుంబాలు ప్రజలు సొంత ఇంటి కల నెరవేరుతుందని ఎంతో ఆశతో లక్షలది రూపాయలు డిపాజిట్లు రూపంలో చెల్లించి, ఏడేళ్లు గడిచినా పాలకులు ఇంటి ఊసు ఎత్తకపోవడంతో ఉసూరుమంటున్నారు. నేటికీ టిడ్కో ఇళ్లు తుప్పల్లోనే ఉన్న దారుణమైన పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో 2014లో ఏర్పడిన టిడిపి ప్రభుత్వంలో ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ఆర్భాటంగా టిడ్కో ఇళ్ల నిర్మాణానికి జి ప్లస్ త్రీ విధానంలో నాలుగు అంతస్తుల భవనాలకు శంకుస్థాపన చేసి నిర్మాణాలు చేపట్టారు. ఆనాటి పాలన ముగింపుకు వచ్చే దశలో ఈ నిర్మాణాలను చేపట్టడం వల్ల అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత టిడ్కో గృహ నిర్మాణాలపై దృష్టి సారించలేదు. జగన్ పాలనలో 2019 నుంచి 2024 లోపు రాష్ట్రంలో కేవలం ఒక్క గుడివాడ నియోజకవర్గంలో మాత్రమే టిడ్కో గృహ నిర్మాణాలపై దృష్టిసారించి, నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించారు. మిగిలిన పట్టణ ప్రాంతాలలో టిడ్కో గృహ నిర్మాణాలపై దృష్టి సారించలేదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు నూజివీడు పట్టణ ప్రాంతంలోనూ టిడ్కో గృహ నిర్మాణాలు నిర్లక్ష్యానికి గురికావడంతో, గృహ నిర్మాణాలు కొనసాగుతున్న ప్రాంతంలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. విష సర్పాలు, ఎలుకలు, పందికొక్కులు, కుక్కలు, పందులు, చెదపురుగులకు నిలయంగా మారింది.

గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇలాకాలో లబ్ధిదారుల అవస్థలు..

నూజివీడు పట్టణ పరిధిలో డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో టిడ్కో గృహ నిర్మాణాలను జి ప్లస్ త్రీగా చేపట్టారు. ఈ నిర్మాణాల్లో 300 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 864 మంది, 365 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 864 మంది, 430 ఎస్ఎఫ్‌టిలో 912 మంది మొత్తంగా 2,640 మందికి గృహాలు మంజూరయ్యాయి. మంజూరైన ఈ గృహాలలో 3 ఎస్ఎఫ్‌టి కేటగిరీలో 849 మంది రూ.500 చొప్పున, 365 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 517 మంది రూ.50 వేల చొప్పున, 430 ఎస్ఎఫ్‌టి కేటగిరీలో 897 మంది రూ.లక్ష చొప్పున మొత్తం రూ.6,91,74,278 డిపాజిట్లుగా లబ్ధిదారులు చెల్లించారు. లబ్ధిదారులు డిపాజిట్లు చెల్లించి ఈ ఏడాదికి ఏడేళ్లు పూర్తయింది. ఏలినాటి శని కూడా ఏడేళ్లకు వదులుతుంది కానీ.. మాకు ఈ తిప్పలు ఏమిటంటూ టిడ్కో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. కోట్లాది రూపాయలు డిపాజిట్లుగా కట్టించుకున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. అదిగో భూతం స్వర్గం అన్న మాదిరిగా కథలు చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇది చాలదన్నట్టు టిడ్కో గృహ నిర్మాణాలకు లబ్ధిదారులు చెల్లించిన వాటా కాక, బ్యాంకర్లు గృహ నిర్మాణాలపై లబ్ధిదారుల పేరిట ప్రభుత్వానికి రుణాలు అందించారు. ఆ రుణాల వాయిదాలు చెల్లించాలంటూ టిడ్కో గృహనిర్మాణ లబ్ధిదారులకు బ్యాంకర్లు నోటీసుల మీద నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసు అందుకుని వాయిదాలు చెల్లించకపోతే చర్యలు చేపడతామంటూ బ్యాంకర్లు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఓ పక్క లక్షలాది రూపాయలు డిపాజిట్లు కట్టి గృహ నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో చేసేది లేక అద్దె ఇళ్లలో మగ్గుతున్నారు. నివసిస్తున్న ఇళ్లకు ప్రతినెల వేలాది రూపాయలు అద్దె చెల్లించడమే కాక, బ్యాంకర్ల నుంచి నోటీసులు అందుకోవడంతో ఏమి చేయాలో పాలుపోని స్థితికి లబ్ధిదారులు చేరుకున్నారు. లక్షలాది రూపాయలు డిపాజిట్లు రూపంలో చెల్లించి ఏడేళ్లు పూర్తయినా అతి సాధారణంగా రెట్టింపు నగదుగా మారుతుందని ఆర్థిక నిపుణులు తెలియజేస్తున్నారు. ఆ డబ్బు తిరిగి రాకపోగా, పాలకులు కట్టించిన రూపాయలు డిపాజిట్లను ఎందుకు వినియోగించారో కూడా తెలియని అయోమయ స్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితులలో అటు పాలకులు, ఇటు అధికారులు, బ్యాంకర్లు లబ్ధిదారుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ పేద కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టిడ్కో గృహ నిర్మాణాలకు సంబంధించి రాష్ట్రం మొత్తంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు పట్టణంలోనూ టిడ్కో గృహ నిర్మాణాల ఊసు లేకపోవడం దారుణం అంటూ పలు ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఎన్నిసార్లు సభలు పెట్టినా.. ఇతర సమస్యల గురించి చెప్పడమే కాని పరిష్కరించిన దాఖలాలు లేవంటూ పలువురు సామాజికవేత్తలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

పి-4లోనూ పెదవి విప్పని సిఎం

ఈనెల 11వ తేదీన నూజివీడు నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన ఆగిరిపల్లి పరిసర ప్రాంతాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించారు. ఈ పర్యటన జాతీయస్థాయిలో ఎంతో ఆర్భాటంగా ప్రచారం కొనసాగించారు. ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విస్తృతంగా పర్యటన కొనసాగించారు. పి-4 కాన్సెప్ట్‌తో పేదరికాన్ని రాష్ట్రం నుంచి తరిమి కొడతామని, లక్షలాది పేద కుటుంబాలు ఆర్థిక అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నామని సాక్షాత్తు సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఇంటికో సం వార్షిక, పంచవర్ష ప్రణాళికలు సైతం సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించిన సిఎం హామీ ఇచ్చారు. కోట్లాది రూపాయలు డిపాజిట్లు రూపంలో సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు పేద, మధ్యతరగతి కుటుంబాలు చెల్లించారు. సొంత ఇంటి కోసం గడిచిన ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న విషయాన్ని ఏమాత్రం అటు సిఎం చంద్రబాబు, ఇటు గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారధి ప్రస్తావించకపోవడం శోచనీయమంటూ పలువురు రాజకీయ పక్ష నేతలు విమర్శిస్తున్నారు.

ఇప్పటికైనా కూటమి పాలకులు స్పందించి టిడ్కో గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. గృహనిర్మాణ శాఖామంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో ఇంటి నిర్మాణాల ఊసు లేదంటే ఆ శాఖ విలువ ఏమిటంటూ సామాన్యులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

పలుచోట్ల 'పోషణ్ పక్వాడా'

ఏలూరు సిటీ : ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో గల ఫస్ట్ సెక్టార్ పుష్పలీల నగర్, ఇజ్రాయిల్ పేట, రాణి నగర్ అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ మంగ ఆధ్వర్యంలో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలకు అధిక శక్తినిచ్చే ఆహార పదార్థాల కోసం తల్లిదండ్రులకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ద్వారకా తిరుమల :** ద్వారకాతిరుమల సెక్టార్‌లోని పంగిడిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ టి.మేరి మాట్లాడుతూ పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ మౌనిక, శైలజ, అంగన్వాడీ టీచర్స్ సుమతి, నాగలక్ష్మి, సైలజ, సింధు, నాగలక్ష్మి హెల్పర్ భారతి ఉన్నారు. **నూజివీడు టౌన్ :** ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ విచ్చేసి మాట్లాడుతూ పోషణ పక్వాడ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో నూజివీడు తహశీల్దార్ సుబ్బారావు, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సౌమ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి : ఎంఎల్ఎ

జీలుగుమిల్లి: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పేర్కొన్నారు. శనివారం జీలుగుమిల్లి సొసైటీ ఆవరణలో జరిగిన ప్రకృతి వ్యవసాయ పిఎండిఎస్ పథకంలో నవ ధాన్యాల విత్తన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు విత్తనాల ప్యాకెట్‌లను ఎంఎల్ఎ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుకు పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పలు రకాల పప్పు ధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు పండించుకొని తినడం ఆరోగ్యకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల అధ్యక్షులు ఎస్.సాయి, పి.రాము, జి.రవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు అర్బన్ : ధాన్యం నూక శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, కృష్ణా డెల్టా పరిధిలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పెసలు అమ్మిన రైతులకు బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. శనివారం ఏలూరు అన్నే భవనంలో నిర్వహించిన రైతుల సమావేశంలో రైతాంగ సమస్యలపై ఆయన మాట్లాడారు. రబీ ధాన్యం మాసూళ్లు జరుగుతున్నాయని చెప్పారు. ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు అధిక ఎండలతో అన్నదాతలు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తడిచినా, అధికంగా ఆరబెట్టినా ఒకవైపు తేమ శాతం, మరోవైపు నూక శాతం వంటి నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయని చెప్పారు. కొనుగోలు నిబంధనలు సవరించి రైతుల వద్దనున్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు చిన్ని పోతురాజు, బైరెడ్డి లక్ష్మణరావు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ బ్రోచర్ విడుదల

ఉంగుటూరు : నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2025-26వ విద్యా సంవత్సరం అడ్మిషన్స్ బ్రోచర్‌ను ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్‌లో బి ప్లస్ గ్రేడ్ పొంది, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, మంచి మౌలిక వసతులు కలిగి విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్న కళాశాల అన్నారు. డిగ్రీ పూర్తి అయిన తర్వాత 100 శాతం ప్లేస్మెంట్ సౌకర్యం కల్పించడమే కాకుండా ఉన్నత చదువులకు ఉచిత కోచింగ్ ఇచ్చి కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో సీటు సంపాదించే విధంగా ప్రోత్సహిస్తూ, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంలో కళాశాల ముందంజలో ఉందన్నారు. అకడమిక్, అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, అధ్యాపకులు జి.రామ్మోహన్, ఐ.లావణ్య, టి.గాబ్రియేలు పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు కరపత్రాలను అందించి, కళాశాలలో చేరవలసిందిగా కోరారు.

గ్రామాలాభివృద్ధికి దాతల సహకారం అమూల్యం : ఎంఎల్ఎ

ఉంగుటూరు : గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కాగుపాడులో గుల్లాలమ్మ, గొంతాలమ్మ ఆలయాల వరకూ 300 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణాలను రూ.23.50 లక్షలతో పూర్తిచేశారు. శనివారం ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. అనంతరం కాగుపాడు గ్రామానికి చెందిన పలువురు దాతలు జాస్తి వెంకట కృష్ణారావు రూ.15.80 లక్షలు, చోడే రాజేష్ రూ.65 వేలు, కడియాల రవిశంకర్, కడియాల రంగారావు సోదరులు రూ.2 లక్షలు మొత్తం రూ.18.45 లక్షలతో సాయిబాబా ఆలయం వద్ద షెడ్డు, ఎస్‌సి కమ్యూనిటీ హాలు ఆధునీకీకరణ పనులు, రజక సామాజిక భవనం వద్ద అదనపు హంగులతో ఆధునీకరించారు. కాగుపాడు ఇన్‌ఛార్జి సర్పంచి పొట్ల ఏడుకొండలు, టిడిపి మండల అధ్యక్షుడు పాతూరి విజయ్‌కుమార్, మాజీ సర్పంచి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పలుచోట్ల 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర'



ముదినేపల్లి : వడాలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ముదినేపల్లి : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని కైకలూరు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. మండలంలో వడాలి గ్రామ పంచాయతీలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి, అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో గల వ్యాపార దుకాణాలు, గృహాల నుంచి తడి, పొడి చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి అశోక్, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా రోడ్లను శుభ్రం చేయటం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, పురవీధులలో అవగాహనా ర్యాలీలు నిర్వహించడం, ముఖ్యంగా పర్యావరణానికి ఇబ్బంది కలిగించే ఇ-వ్యర్థాల ప్రత్యేక నిర్వహణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విస్తరణ కార్యక్రమాల గురించి గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ వివరించారని ఎంపిడిఒ తెలిపారు.

జీలుగుమిల్లి : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మండల ప్రత్యేక అధికారి, డిఎల్‌పిఒ మహ్మద్ రజాఉల్ల పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కామయ్య పాలెం గ్రామంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బోడిక బోగేశ్వరావు, ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత కోసం కృషిచేయాలని ఎంపిడిఒ జి.మణికుమారి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, కంప్యూటర్లు, పరిసరాలను శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్రబాబు ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేసి స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి మోదుగు సునంద, పిఆర్ ఎఇ సంపత్ కుమారి పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరు గ్రామ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ దివాస్, ఇంటి చుట్టూ శుభ్రత మన దేశమంతా పరిశుభ్రత అంటూ స్కూల్ పిల్లలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, జనసేన మండల అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి : స్వచ్ఛతపై తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గంప వెంకట్రావు, విద్యార్థులు పాల్గొన్నారు. **ముసునూరు:** ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బి.వి.సత్యనారాయణ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, నీరజ నాయుడు, రేవతి, శ్రీనివాస చౌదరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : అన్ని గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా తమ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు బాధ్యతతో కార్యాలయ ప్రాంగణాలను శుభ్రపరుచుకోవాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి సూచించారు. చింతపూడి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వద్ద ఏర్పాటుచేసిన స్వచ్ఛంద - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రసూల్, డాక్టర్ కాశీ, ఫార్మసీ సూపర్వైజర్ రామకృష్ణ, నర్సింగ్ ఇన్‌ఛార్జి ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ప్రజల భాగస్వామ్యంతోనే వ్యర్థాల నిర్మూలన సాధ్యపడుతుందని, తద్వారా స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు మార్గం సుగమమం అవుతుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, దీనిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, డివిజన్ ఇన్‌ఛార్జి కూనా మాణిక్యం పాల్గొన్నారు. **నూజివీడు టౌన్ :** నూజివీడు పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ విచ్చేసి ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.